సాక్షి రంగారెడ్డి

సోమవారం । 29 । జూలై । 2024



పాలన సాగక!

పంచాయతీ పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 10లో▸



పర్యావరణ పరిరక్షణకు..

మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 10లో▸



ద్విచక్ర వాహనాల దహనం

పాత కక్షలతో ఓ యువకుడు ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను స్నేహితులతో కలిసి దహనం చేశాడు. 10లో▸

న్యూస్‌రీల్

ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటును విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఎవరూ విశ్వసించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పి నెలలు తిరగకముందే మాట మార్చారని విమర్శించారు. నిబంధనలు తుంగలో తొక్కి భూములు సేకరించారని ఆరోపించారు. కలెక్టర్‌ను ఫార్మా పరిధిలోని భూముల్లో పరిశీలనకు పంపడం ద్వారా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఫార్మా రద్దు చేస్తామని మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కోదండ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సంఘటితంగా ఉంటేనే గుర్తింపు

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం



చల్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కోదండరాం తదితరులు

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ఉద్యమకారులు సంఘటితంగా ఉంటేనే ప్రభుత్వం వేగంగా గుర్తింపునిస్తుందని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొ. కోదండరాం అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జేఏసీ చైర్మన్‌గా కీలకపాత్ర పోషించిన వెదిరె చల్మారెడ్డి ప్రథమ వర్ధంతి సభను ఆదివారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఆ నాటి పలువురు ఉద్యమకారులు హాజరై చల్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ.. మన వెన్నంటి నడిచినవాళ్లను ఎప్పటికీ మరిచిపోవద్దని, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమం ఊపందుకునేందుకు చల్మారెడ్డి చేసిన పోరాటం మరవలేమన్నారు. తెలంగాణ ఉద్యమం ఒక వ్యక్తి చరిత్ర కాదని, ఉమ్మడి చరిత్ర అని గ్రహించాలన్నారు. అందరి పోరాట ఫలితంగానే రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ పోరాటాన్ని పుస్తకరూపంలో తీసుకువచ్చినప్పుడే మనమంతా చరిత్రలో నిలిచిపోతామన్నారు. అందుకు ప్రతి ఉద్యమకారుడు కృషి చేయాలని, అందులో తన వంతు సహాయ సహకారాలుంటాయన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణలో రంగారెడ్డి జిల్లాకు న్యాయం జరుగుతుందని భావిస్తే.. జిల్లా అస్తిత్వమే లేకుండా చేశారని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు, రియల్ వ్యాపారులకు ఉపయోగపడిందే తప్ప ఈ ప్రాంతవాసులకు ఉపయోగపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు జిల్లాకు తీరని అన్యాయం చేశారన్నారు. జిల్లా అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దివంగత చల్మారెడ్డి సతీమణి సువర్ణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, ఉద్యమకారులు అశోక్‌కుమార్, విక్టర్, వంగేటి లక్ష్మారెడ్డి, శివకుమార్, రాచర్ల వెంకటేశ్, బర్ల జగదీశ్‌యాదవ్, కావలి నర్సింహ, మడుపు వేణుగోపాల్‌రావు, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, జంగయ్య, ఎండీ గౌస్, సతీష్, జంగయ్య, రవీందర్, అంజయ్య, రమేష్, నిరంజన్ పాల్గొన్నారు.

బోనం.. ఘనం



షాబాద్: గొల్లూరుగూడలో బోనం ఎత్తుకున్న వికారాబాద్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

మొయినాబాద్: సురంగల్‌లో బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు





షాబాద్: నాగర్‌గూడలో నెత్తిన బోనంతో యువతి



చేవెళ్ల: మీర్జాగూడలో నెత్తిన బోనంతో చిన్నారి



కందుకూరు: ముచ్చర్లలో పోతురాజుల విన్యాసాల నడుమ బోనాల ఊరేగింపు

దప్పుల దరువులు.. శివసత్తుల పూనకాలు.. పోతురాజుల విన్యాసాలు.. నెత్తిన బోనాలతో మహిళల ఊరేగింపు.. జిల్లాలో ఆదివారం ఆషాఢ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. వేకువజాము నుంచే గ్రామ దేవతల ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇంటి దొంగలపై నిఘా!



సిబ్బంది పనితీరుపై డిస్కం ప్రత్యేక దృష్టి

- బిల్లుల వసూళ్లలో చేతివాటంపై సీరియస్
- గతంలో కందుకూరు ఈఆర్‌ఓలో.. తాజాగా షాద్‌నగర్ ఈఆర్‌ఓలో తేడాల గుర్తింపు
- ఇకపై బిల్లుల వసూలు.. డిస్కం ఖాతాలో జమపై రోజువారీగా ఆరా
- తేడాలుంటే సహించేది లేదని తేల్చిచెప్పిన సీజీఎం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇప్పటి వరకు విద్యుత్ చౌర్యం, మీటర్ల ట్యాంపరింగ్, మొండిబకాయిల వసూళ్లపై దృష్టి సారించిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తాజాగా అంతర్గత సిబ్బంది పనితీరుపై నిఘా పెట్టింది. ఏ ఆర్టిజన్/లైన్‌మెన్..? ఏ రోజు ఏ వినియోగదారుని వద్ద ఎంత బిల్లు వసూలు చేశారు? వసూలు చేసిన బిల్లును ఏ ఈఆర్‌ఓ (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు) కేంద్రంలో జమ చేశారు? వంటి అంశాలపై దృష్టి సారించారు. సంస్థలో పని చేస్తూ.. ఆర్థికంగా నష్టం చేకూర్చుతున్న సిబ్బందిని గుర్తించి చర్యలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే కందుకూరు ఈఆర్‌ఓ కేంద్రంలో ముగ్గురు ఉద్యోగులపై వేటు వేసిన డిస్కం.. తాజాగా షాద్‌నగర్‌లోని ఆర్టిజన్‌పై వేటు వేసింది. సంస్థ డబ్బులను సొంతఖాతాలో జమ చేసుకునే వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఆర్‌ఆర్ జోన్ సీజీఎం ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు.

రూ.3,63,796 స్వాహా..

షాద్‌నగర్ డివిజన్‌లో నిరక్షరాస్యులు ఎక్కువ. గ్రామీణ ప్రాంతాల్లోని మెజార్టీ వినియోగదారులకు బిల్లుల చెల్లింపు సాంకేతిక పరిజ్ఞానంపై సరైన అవగాహన లేదు. ఇప్పటికీ చాలా మంది తమ విద్యుత్ బిల్లులను క్షేత్రస్థాయిలో పని చేసే ఆర్టిజన్లు/లైన్‌మెన్‌లకే చెల్లిస్తుంటారు. వీరిలో కొంత మంది వెంటనే ఆయా ఈఆర్‌ఓ కేంద్రాల్లో జమ చేస్తుండగా, మరి కొంత మంది సొంత ఖాతాల్లో జమ చేసుకుంటున్నారు. తమ అవసరాలు తీరిన తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా గుట్టు చప్పుడు కాకుండా సంస్థ ఖాతాలో జమ చేస్తున్నారు. తాజాగా వెలిజర్ల్ సెక్షన్‌లో పని చేస్తున్న ఆర్టిజన్ పి.ప్రభాకర్‌రెడ్డి వినియోగదారుల నుంచి రూ.3,63,796 నెలవారీ విద్యుత్ బిల్లులు వసూలు చేశాడు. ఈ మొత్తాన్ని ఈఆర్‌ఓలో జమ చేయకపోగా సొంత ఖర్చులకు వాడుకున్నాడు. విద్యుత్ బిల్లులు చెల్లించిన ఓ వినియోగదారుడికి అనుమానం వచ్చి ఆన్‌లైన్‌లో సర్వీసు నంబర్‌పై ఉన్న బిల్లును చెక్ చేసుకోగా అసలు విషయం బయటపడింది. ఈ అంశంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టిన అధికారులు రెండు రోజుల క్రితం అతడిని సస్పెండ్ చేశారు.

గతంలో కందుకూరులో..

రాజేంద్రనగర్ సర్కిల్ కందుకూరు ఈఆర్‌ఓ సెంటర్‌లో 2022 ఏప్రిల్ 20న ఓ ప్రైవేటు కలెక్షన్ ఏజెంట్ రూ.3.10 లక్షలు బిల్లు వసూలు చేసి, ఆ మొత్తాన్ని ఈఆర్‌ఓ కేంద్రంలోని అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌కు ఇవ్వగా సొంతఖాతాలో జమ చేసుకున్నాడు. రెండు రోజుల తర్వాత ఓ చెక్కును జమ చేశారు. అది కూడా బౌన్స్ అయింది. ఎప్పటికప్పుడు బిల్లుల వసూళ్లు, జమ అవుతున్న మొత్తంపై ఆరా తీయాల్సిన జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ బాలరాజు, ఎల్‌డీసీ రమేష్ సైతం ఏఏఓకు పరోక్షంగా సహకరించారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న డిస్కం అప్పట్లోనే ఈ ముగ్గురిపై వేటు వేసింది. ఈ అంశాన్ని పూర్తిగా మరిచిపోక ముందే తాజాగా మరో మోసం వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది.



కల్వకుర్తి సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

వరాల జల్లు

- బీటీరోడ్ల నిర్మాణానికి రూ.180 కోట్లు
- ఆమనగల్లులో రూ.10 కోట్లతో స్కిల్ సెంటర్
- ఆమనగల్లులో కళాశాలల భవన నిర్మాణాలకు నిధులు
- హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణ
- మాడ్గులలో రూ.10 కోట్లతో పాఠశాలల అభివృద్ధి
- జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సభలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి వరాలజల్లు కురిపించారు. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అంటూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినప్పటికీ తాను కల్వకుర్తి బిడ్డనే అని అన్నారు. కల్వకుర్తి సమీపంలోని కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు కల్వకుర్తి పట్టణంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే నారాయణరెడ్డితో పాటు తాను కూడా ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ కల్వకుర్తిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. నియోజక వర్గంలో బీటీరోడ్ల నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కల్వకుర్తి పట్టణంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అన్ని గిరిజన తండాలకు బీటీరోడ్డు నిర్మిస్తామని, ఐదు వంతెనల నిర్మాణానికి రూ.15కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో రూ.10 కోట్లతో స్కిల్‌సెంటర్ ఏర్పాటుతో పాటు అన్ని ప్రభుత్వ కళాశాలల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాడ్గులలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.10 కోట్లు, మాడ్గుల గ్రామ అభివృద్ధి కోసం రూ.5 కోట్లు, వెల్దండ మండలంలో పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కల్వకుర్తి మండలం తాండ్రలో తాను చదువుకున్న ఉన్నత పాఠశాలను రూ.5 కోట్లతో ఆధునీకరిస్తామన్నారు. హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిని త్వరలో నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించనున్నామని సీఎం తెలిపారు. కడ్తాల సమీపంలోని ముచ్చర్ల వద్ద రూ.వందకోట్లతో 50 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఆగస్టు 1న శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

కల్వకుర్తికి ప్రాధాన్యత ఇవ్వండి

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి, గుర్రం కేశవులు, రాములు, యాట నర్సింహ, గూడురి శ్రీనివాస్‌రెడ్డి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మాడ్గుల మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి నాగలి బహూకరించారు.

విలీనం దిశగా..

- అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పంచాయతీల కసరత్తు
- జీహెచ్ఎంసీలోనా..? బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లోనా..?
- వివరాల సేకరణలో అధికారులు
- 'స్థానిక' సంస్థల ఎన్నికలలోగా ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు

మొయినాబాద్: మండల పరిధిలోని రెండు గ్రామ పంచాయతీలను జీహెచ్ఎంసీలోగానీ.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోగానీ విలీనం చేసేందుకు కసరత్తు నడుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో రెండు పంచాయతీల పరిధిలో పూర్తి వివరాలు అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు పూర్తిగా జీహెచ్ఎంసీ పరిధిలోకి తేవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పంచాయతీలను విలీనం చేసుందుకు చర్యలు చేపడుతున్నారు. ఆయా పంచాయతీల పరిధిలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయి.. జనాభా.., భూ విస్తీర్ణం.. ఎన్ని ఎకరాల భూమి ఉంది.. జీహెచ్ఎంసీ పరిధికి పంచాయతీలు ఎంత దూరంలో ఉన్నాయి.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి ఎంత దూరంలో ఉన్నాయి..? అనే అంశాలను పరిగణలోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నారు.

ముందుగా ఆ కార్పొరేషన్‌లో..

అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పంచాయతీలను ముందుగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. తర్వాత ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మొత్తం జీహెచ్ఎంసీలో కలిపే ప్రక్రియ ఉంటుందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగిసింది. ఆగస్టులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఈ రెండు పంచాయతీలకు మాత్రం ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. ఎన్నికలలోపే అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పంచాయతీలను బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఔటర్ చెంతనే ఉండటంతో..

అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయడానికి ఔటర్ రింగ్ రోడ్డుకు అతి చేరువలో ఉండటంతోపాటు జంట జలాశయాలకు ఆనుకుని ఉండటమే కారణమని తెలుస్తోంది. ఔటర్ దాటాక ఈ రెండు పంచాయతీల పరిధిలోనే కమర్షియల్ వ్యాపార కేంద్రాలు అధికంగా వెలుస్తున్నాయి. ప్రముఖుల ఫాంహౌస్‌లు, రిసార్ట్స్, స్టూడియోలు, ఉన్నత విద్యా సంస్థలు సైతం ఉన్నాయి.



గ్రామ పంచాయతీల వివరాలు

	అజీజ్‌నగర్	హిమాయత్‌నగర్
జనాభా	4,757	3,902
ఎస్టీలు	23	95
ఎస్సీలు	1,541	1,121
ఇతరులు	3,193	2,686
కుటుంబాల సంఖ్య	1,572	1,560
పన్నుల రూపంలో వచ్చే వార్షిక ఆదాయం	1,10,98,410	72,14,952
జీహెచ్ఎంసీ లిమిట్స్‌కు దూరం	12 కిలోమీటర్లు	15 కిలోమీటర్లు
బండ్లగూడ కార్పొరేషన్ లిమిట్స్‌కు దూరం	2 కిలోమీటర్లు	5 కిలోమీటర్లు
ప్రభుత్వ రికార్డుల ప్రకారం భూమి	2,237.17 ఎకరాలు	1,178.01 ఎకరాలు

సబ్సిడీపై దాణా ఇప్పించండి

సాక్షి,సిటీబ్యూరో: పౌల్ట్రీ రంగానికి సబ్సిడీపై దాణా ఇప్పించాలని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ, హైద్ జోన్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ప్రతినిధుల బృందం ఈ మేరకు వినతి పత్రం సమర్పించింది. పెరిగిన దాణా ధరల కారణంగా పౌల్ట్రీ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. మొక్కజొన్నతో ఇతర ధాన్యాల దాణాలు కూడా సబ్సిడీపై అందించి సంక్షోభం నుంచి ఆదుకోవాలని కోరింది. ప్రతినిధుల బృందంలో కమిటీ, ఫెడరేషన్ ప్రతినిధులు కాసర్ల మోహన్ రెడ్డి, వుడుతల భాస్కర్ రావు,వుప్పల నర్సింహా రెడ్డి, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, వంగేటి బాలకృష్ణ రెడ్డి, జక్కా సంజీవ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.



సీఎంను కలిసిన నాయకులు

పాతకక్షలతో ద్విచక్ర వాహనాల దహనం



అబ్దుల్లాపూర్‌మెట్‌లో కాలి బూడిదైన ద్విచక్రవాహనాలు

పోలీసుల అదుపులో నలుగురు నిందితులు

అబ్దుల్లాపూర్‌మెట్: పాత కక్షల కారణంగా ఓ యువకుడు కాలనీలోని ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను తన ముగ్గురు స్నేహితులతో కలిసి దహనం చేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీకి చెందిన మొగిళ్ల మహేందర్ అనే యువకుడు కాలనీకి చెందిన పలువురితో గతంలో గొడవ పడ్డాడు. దీన్ని మనసులో పెట్టుకున్న అతడు తన ముగ్గురు స్నేహితులైన శివ, మరో ఇద్దరు మైనర్ యువకులతో కలిసి శనివారం అర్ధరాత్రి కాలనీలో పార్కింగ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలను దహనం చేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేయగా మహేందర్‌పై అనుమానం ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పాత కక్షల కారణంగానే శివ అనే యువకుడు, మరో ఇద్దరు మైనర్‌లతో కలిసి బైకులకు నిప్పు అంటించినట్లు అంగీకరించాడు. దీంతో నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొంగరలో కేంద్ర సహాయ మంత్రి పర్యటన



కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజును సన్మానిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీలో పర్యటించారు. కొంగరలోని కౌన్సిలర్ వనం శ్రీనివాస్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మను ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు నర్సగళ్ల ప్రవీణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

నందిగామ: తాళం వేసిన ఇళ్లే టార్గెట్ గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన శనివారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల రాము శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఉద్యోగి. రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్లాడు. ఆదివారం వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువా తాళం పగులగొట్టిన దుండగులు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలోని మరో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని విలువైన డాక్యుమెంట్లను ఎత్తుకెళ్లారు. రాము ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగతో గేదె మృతి



గేదె కళేబరం

తుర్కయంజాల్: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి గేదె మృతి చెందిన సంఘటన మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజాపూర్‌లోని సాయినాథ్ కాలనీలో నివాసం ఉండే పాలరాజు స్థానికంగా ఓ హోటల్ యజమాన్యానికి చెందిన భూమిలోకి గేదెలను మేపడానికి తీసుకెళ్లారు. అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగకు ఓ గేదె తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో అప్రమత్తమైన రాజు మిగతా గేదెలను పక్కకు కొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగలను సరిచేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గేదె మృతి చెందిందని బాధితుడు ఆరోపించారు. తనకు రూ.లక్ష యాభై వేలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



జింకకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం రూరల్: కుక్కల దాడిలో జింకకు తీవ్ర గాయాలైన సంఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. యాచారం మండలం నందివనపర్తికి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బావి వద్ద వీధి కుక్కలు ఓ జింకపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన జింకను స్థానికంగా ఉన్న విజయ్ కుమార్ గమనించి పశువుల ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. అనంతరం ఫారెస్టు అధికారుల సూచన మేరకు జింకను నగరంలోని జూపార్కుకు తరలించారు.

నిధులు లేక.. పాలన సాగక!

- గాడి తప్పిన పంచాయతీల పాలన
- కార్యదర్శులపై పెరిగిన పని ఒత్తిడి

షాబాద్: పంచాయతీ పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి పల్లె పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేక ఎన్నో పనులకు ఆటంకాలు కలుగుతున్నాయి. నిధులు సకాలంలో రాకపోవడంతో ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతుంది. ఫిబ్రవరి 2 వరకు సర్పంచులు, పాలకవర్గాలకు జీపీల బాధ్యత ఉండేది. గ్రామంలో ఏ పని కావాలన్నా వారే ముందుగా ఖర్చు చేసి తర్వాత బిల్లులు డ్రా చేసుకునేవారు. వారి పదవీ కాలం ముగిసిన తర్వాత ఆ భారం పంచాయతీ కార్యదర్శులపై పడింది. జీపీలకు నిధులు రాక పోవడంతో కార్యదర్శులు సొంతంగా రూ.వేలల్లో ఖర్చులు చేస్తున్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ తదితర పనులకు కార్యదర్శులే సొంతంగా వెచ్చిస్తున్నారు. ఖాతాల్లో డబ్బులు లేకున్నా పాలనను ముందుకు నెట్టుకొస్తున్నారు. నిధులు విడుదలలో జాప్యం జరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు.

పేరుకే ప్రత్యేకాధికారులు

పాలక వర్గాల పదవీ కాలం పూర్తయిన తర్వత పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వీరు అప్పటికే వారి బాధ్యతల్లో తీరిక లేకుండా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొకరికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు ఉన్నాయి. దీంతో వారు జీపీల పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం వారంలో ఒక్కసారి కూడా గ్రామాలకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యదర్శులే ముఖ్యమైన పనులు, సంతకాల కోసం ప్రత్యేకాధికారుల వద్దకు వెళ్తున్నారు.

వేతనాలు ఇవ్వలేని దుస్థితి

జిల్లాలోని 558 గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రావడం లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి నాలుగు సార్లు పంచాయతీలకు అందజేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా రావడం లేదు. నిధులు సకాలంలో రాకపోవడంతో అప్పటి పాలకవర్గాల సభ్యులు జేబులో నుంచి ఖర్చు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణకు సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి ఉన్నా.. చాలా గ్రామాలకు ఇవి సరిపోవడం లేదు. దీంతో కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. చిన్న పంచాయతీలలో ట్రాక్టర్లు నిర్వహణ కష్టంగా మారింది.



సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

నిధులు మంజూరయ్యాయి



పంచాయతీలకు రావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. పంచాయతీ కార్మికులకు ఐదు రోజుల్లో వారి ఖాతాల్లో నగదు జమ అవుతాయి. గ్రామాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని పనులు సక్రమంగా చేయిస్తున్నాం.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



బ్రహ్మచారి మృతదేహం

తలకొండపల్లి: బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని జూపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం.. కేశంపేట మండలం కాకనూర్‌కు చెందిన ఒడ్ల బ్రహ్మచారి(57) పని నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యలో జూలపల్లి శివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కూతురు శిరీష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- భూ సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన
- పోలీసుల హామీతో కిందకు దిగిన సోమ్లానాయక్



సెల్‌టవర్ ఎక్కిన సోమ్లానాయక్

తలకొండపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం ఓ వ్యక్తి టవరెక్కి నిరసన తెలిపారు. పోలీసుల హామీతో కిందకు దిగాడు. ఈ ఘటన మండల పరిధిలోని పూలుసింగ్ తండా పంచాయతీ పరిధిలోని బుద్యా తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన మెగావత్ సోమ్లా నాయక్‌కు తమ దాయాదులతో భూమి విషయంలో తరచూ గొడవపడుతున్నారు. దీంతో విసిగి వేసారిన సోమ్లా నాయక్ తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉన్న సెల్ టవరెక్కాడు. స్థానికులు టవర్‌పై నుంచి కిందికి దిగాలని విఫలయత్నం చేశారు. చివరికి పోలీసులు అక్కడకు చేరుకుని ఫోన్లో మాట్లాడి స్పష్టమైన హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సోమ్లానాయక్‌ను తహసీల్దార్ రంగారెడ్డి వద్దకు తీసుకెళ్లారు. భూ సర్వే చేయించి సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ జ్ఞానేశ్వర్

చేవెళ్ల: ముదిరాజుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ అన్నారు. ఆదివారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు నగరంలో ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ముదిరాజ్‌లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన్ను సన్మానించిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, శివరాజ్, నాయకులు గణేశ్, వెంకటేశ్, శ్రీనివాస్, మల్లేశ్, భిక్షపతి తదితరులున్నారు.

అదుపు తప్పిన కారు

మణికొండ: కారు నేర్చుకునే క్రమంలో రోడ్డుపైకి వచ్చిన ముగ్గురు మైనర్లు కారు అదుపుతప్పడంతో రోడ్డు పక్కన గుంతలో పడిపోయిన సంఘటన నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లికి చెందిన ముగ్గురు మైనర్లు కారు నేర్చుకునేందుకు వట్టినాగులపల్లి వైపు వచ్చారు. శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాల ముందు రోడ్డు ఖాళీగా, పెద్దగా ఉండటంతో అదిఅదుపు తప్పింది. రోడ్డు పక్కకు వెళ్లి గోతిలో పల్టీ కొట్టింది. అందులో ఉన్న ముగ్గురికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి సంఘటనలపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని వట్టినాగులపల్లి వాసులు కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మైలార్‌దేవ్‌పల్లి: అనుమానస్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీలో నివసించే కిష్టప్ప (52) దంపతులు తమ కొడుకు మహేందర్‌తో కలిసి జీవిస్తున్నారు. శనివారం తండ్రి కొడుకులు మద్యం సేవించారు. రాత్రి నుంచి తండ్రి, కొడుకుల మధ్య కుటుంబ గొడువ లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కిష్టప్ప శరీరానికి ఎలాంటి దెబ్బ లు తగలకుండా మృతి చెందాడు. దీంతో ఉదయం కిష్టప్ప భార్య పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇరువురి మధ్య గొడవ జరిగిన విషయం నిజమేనని.. కాని కిష్టప్ప ఎలా చనిపోయాడనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాచకొండ రీల్స్!

- తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో మీమ్స్, వీడియోలు
- డ్రగ్స్, సైబర్ క్రైమ్, మహిళల భద్రత తదితరాలపై అవగాహన
- ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో ప్రచారం
- రాచకొండ సోషల్ మీడియాలకు లక్షల్లో ఫాలోవర్లు
- ప్రతి పోలీస్ వాట్సప్ డీపీలో అవగాహన పోస్టరే

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి కాలంలో రీల్స్, మీమ్స్ ఎంత ఫేమస్ అవుతున్నాయో అందరికీ తెలిసిందే. అందుకే వీటినే లక్ష్యంగా చేసుకుని రాచకొండ పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి రకరకాల నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో థీమ్ ఆధారిత రీల్స్, మీమ్స్, లఘు వీడియోలను సృష్టించి రాచకొండ పోలీసులకు చెందిన ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్‌లలో పోస్టు చేస్తున్నారు. ఆయా సామాజిక మాధ్యమాల ఫాలోవర్లకు నిరంతరం టచ్‌లో ఉంటున్నారు.

లక్షల్లో ఫాలోవర్లు

ప్రజల్లో సామాజిక మాధ్యమాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో రాచకొండ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగానికి అవగాహనతోనే అడ్డుకట్టపడుతుంది. దీంతో ఆయా అంశాలపై ప్రజలను సమర్థవంతంగా చైతన్యం చేసేందుకు సోషల్ మీడియా సరైన వేదిక. ప్రస్తుతం రాచకొండ పోలీసు కమిషనరేట్ ఎక్స్ ఖాతాకు 1,90,128 మంది, ఫేస్‌బుక్‌కు 35,350, ఇన్‌స్టాగామ్‌కు 9,736, యూట్యూబ్‌కు 750 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత..

మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, దొంగతనాలు, రహదారి భద్రత తదితర అంశాలపై థీమ్ ఆధారిత పోస్టర్లు, మీమ్స్, రీల్స్ సృష్టించి నిరంతరం ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) విభాగంలో ప్రత్యేకంగా సోషల్ మీడియా యూనిట్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇందులో 4–5 మంది సిబ్బంది రోజుకు ఒక అంశాన్ని తీసుకుని సినిమాల్లోని సన్నివేశాలు, పాపులర్ డైలాగ్‌లతో పోస్టర్ డిజైనింగ్, వీడియోలను క్రియేట్ చేస్తున్నారు. వీటిని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యూయన్సర్లకు, కమ్యూనిటీ గ్రూప్‌లలో పోస్టు చేస్తున్నారు. దీంతో ప్రచారం విస్తృతమవుతుంది.

'సోషల్'లో నిరంతరం సమాచారం

ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్ టైం జాబ్స్, ఓఎల్‌ఎక్స్ తదితర సైబర్ నేరాలతో పాటు సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలతో జరిగే రోడ్డు ప్రమాదాల తాలూకు లైవ్ వీడియోలను తీసుకుని, వాటికి మీమ్స్, వీడియోలను జత చేసి సందేశాత్మకంగా చిత్రీకరిస్తున్నారు. అలాగే భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, రహదారి మళ్లింపులు వంటి సమస్త సమాచారాన్ని ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడదాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనం అటవీ ప్రాంతంలో ఆదివారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో వన మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానికంగా గురుకుల విద్యార్థినులతో ఎమ్మెల్యే కలిసి మొక్కలను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 20 కోట్ల మొక్కలను పెంచడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ప్రతిఒక్కరూ తమవంతుగా ఐదు మొక్కలను నాటడంతో పాటుగా వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. తమ ఇంటి ఆవరణతో పాటుగా వ్యవసాయ పొలాల్లో మొక్కలను నాటి పెంచాలని సూచించారు. ప్రజలందరూ ఉద్యమ స్ఫూర్తితో మొక్కలను నాటి వాటిని సంరక్షించడంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, బాబర్‌అలీఖాన్, వెంకట్‌రాంరెడ్డి, అరుణఅంజయ్యగౌడ్, నర్సింలు, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనునాయక్, నవీన్, ఖదీర్, సీతారాములు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అజీజ్, ప్రిన్సిపాల్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామానికి చెందిన కొనింటి శ్రీధర్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌ను ఆదుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.5 లక్షలు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ కుటుంబ సభ్యులకు సీఎం ఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, రాంరెడ్డి, నర్సింలు, శ్రీనివాసు, ద్విజేందర్, శివ, రవి, అంజయ్య, రఘు పాల్గొన్నారు.